ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 26 అక్టోబరు, 2026 | పేజీలు : 05

ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన



వివరాలు మెయిన్‌లో...

పిడికిలి బిగిస్తే పిడుగుల వేగం!

నిమిషంలో 193 పంచ్‌లు..
నాలుగేళ్ల ఇధికా ప్రపంచ రికార్డు
జిల్లా టోర్నీలో స్వర్ణం.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
రెండు ప్రాంతీయ టోర్నీల్లోనూ పతకాలు

ప్రజాపక్షం/కరీంనగర్: బుడిబుడి అడుగులు వేసే వయసు.. బొమ్మలతో ఆడుకోవాల్సిన పసిప్రాయం.. కానీ ఆ చిన్నారి పిడికిలి బిగిస్తే పంచ్‌ల వర్షం కురుస్తుంది! సెకనుకు మూడు పంచ్‌లకుపైగా.. నిమిషం ముగిసేసరికి ఏకంగా 193 పంచ్‌లు! ప్రత్యర్థిని ఓడించాలనే లక్ష్యం కాదు.. తనలోని ప్రతిభకు హద్దుల్లేవని చాటాలనే తపన. వయసు నాలుగేళ్ల పది నెలలే.. సాధన మొదలుపెట్టి ఏడాది కూడా పూర్తికాలేదు.. అయినా ప్రపంచ రికార్డు పుటల్లో చోటు సంపాదించింది. కరీంనగర్‌కు చెందిన రావికంటి ఇధికా ఇప్పుడు ఓ చిన్నారి మాత్ర మే కాదు.. అసాధారణ ప్రతిభకు చిరునామా! హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుని అందరినీ అబ్బురపరిచింది. చిన్న చేతులతో ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించింది ఈ చిన్నారి. తల్లిదండ్రుల ప్రోత్సాహానికి, గురువు మార్గదర్శకత్వానికి, చిన్నారి పట్టుదలకు నిలువెత్తు నిదర్శనం. రికార్డు సాధించాలంటే పెద్ద వయసు, సుదీర్ఘ అనుభవం తప్పనిసరి కాదని ఇధికా నిరూపించింది. 2026 అక్టోబరు 8న కరీంనగర్‌లో నిర్వహించిన రికార్డు ప్రయత్నంలో కేవలం ఒక నిమిషంలో 193 పంచ్‌లు సంధించింది. అప్పటికి ఆమె వయసు నాలుగేళ్ల 10 నెలల 23 రోజులు మాత్రమే. ఈ ప్రదర్శనతో అత్యంత పిన్న వయసులో ఈ ఘనత సాధించిన బాలికగా గుర్తింపు పొందింది. అక్టోబరు 22న రికార్డుకు సంబం ధించిన ధ్రువపత్రం జారీ అయింది. వయసుకు మించిన వేగం.. అలసటకు తావులేని ఏకాగ్రత.. లక్ష్యంపై నిలకడైన దృష్టి.. ఇవన్నీ కలిసే ఈ అసాధారణ ప్రదర్శనకు బాటలు వేశాయి.



ఏడాది ప్రయాణం.. విజయాల పరంపర

ఇధికా తైక్వాండో సాధన ప్రారంభించి ఏడాది మాత్రమే అవుతోంది. అయినా ఈ కొద్దికాలంలోనే తన ప్రతిభను పోటీల వేదికపై చాటుకుంది. అసోసియేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. రెండు ప్రాంతీయ స్థాయి టోర్నమెంట్లలోనూ పాల్గొని పతకాలు గెలుచుకుంది. ఒకవైపు ప్రపంచ రికార్డు.. మరోవైపు పోటీల్లో పతకాలు.. ఇలా తొలి అడుగుల్లోనే విజయాల బాట పట్టింది. ఈ ఘనతలు ఆమెకు లభించిన గుర్తింపుతో పాటు భవిష్యత్తుపై ఆశలు పెంచుతున్నాయి.

గురువు శిక్షణ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం

ప్రతిభకు పదును పెట్టేది సాధన.. ఆ సాధనకు దిశ చూపేది సరైన మార్గదర్శక త్వం. ఇధికా కరీంనగర్‌లోని కేహెచ్‌ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో తైక్వాం డో శిక్షణ పొందుతోంది. తైక్వాండో శిక్షకుడు రాకేష్, మార్షల్ ఆర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మాస్టర్ రాకేష్ పర్యవే క్షణలో మెళకువలు నేర్చుకుంటోంది. తండ్రి రావికంటి కృష్ణ సంతోష్, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఆమెకు తోడుగా నిలుస్తోంది. చిన్న వయసులోనే శిక్షణపై ఆసక్తి చూపు తూ క్రమశిక్షణతో సాధన కొనసా గించడం ఆమె విజయాలకు పునా దిగా నిలుస్తోంది .

చిన్నారి పంచ్.. ప్రపంచ రికార్డు..

పతకం గెలవడం ఒక విజయం.. ప్రపంచ రికార్డు సాధించ డం మరో మైలురాయి. అయితే ఇధికా ప్రయాణంలో కనిపి స్తున్న అసలు ప్రత్యేకత.. ఇంత చిన్న వయసులోనే క్రీడపై ఆ సక్తి, సాధనపై శ్రద్ధ, లక్ష్యా న్ని చేరుకోవాలనే తపన. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి సరైన అవకాశాలు కల్పిస్తే వా రు అద్భుతాలు సాధిస్తారనేది ఈ చిన్నారి కృషి పట్టు దల స్పష్టం చేస్తుంది. కరీంనగర్ పేరు ప్రపంచ రికార్డు వేదికపై మార్మోగేలా చేసిన ఇధికాపై స్థానికంగా అభినం దనలు వె ల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో తైక్వాండోలో మరిన్ని వి జయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగా లని క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

పల్లెను మింగుతున్న గుడుంబా భూతం!

వాగుల వెంబడి బట్టీలు.. పల్లెల్లో ఏరులై పారుతున్న నాటుసారా.. నిఘా ఏది?

ప్రజాపక్షం / పెంచిక-లపేట్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా ఏరులై పారుతోంది. పల్లె సీమలను అక్రమ మద్యం భూతం కబళిస్తుండటంతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. నిషేధం కాగి తాలకే పరిమితమై, నాటు సారా దందా యథేచ్ఛగా సాగు తుండటంపై సర్వత్రా తీవ్ర ఆందోళన వ్యక్తమవు తోంది.

పల్లెలను ముంచెత్తుతున్న నాటుసారా



జిల్లాలోని పెంచికల్ పేట్, దహెగాం, కాగజ్‌నగర్, కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూర్ మండలాల పరిధిలో గుడుంబా కేంద్రాలు జోరుగా సాగుతు న్నాయి. లోడ్‌పల్లి, చేడ్వాయి, ఎల్కపల్లి, దరోగపల్లి, పోతేపల్లి, లంబాడేటి, మర్రిపల్లె, రాప్పల్లి, వంజిరి, అంబగట్ట, బొంబాయిగూడ, కొండేపల్లి తది తర గ్రామాలే లక్ష్యంగా అక్రమ రవాణాదా రులు పాగా వేశారు. గుట్టుచప్పుడు కాకుండా వాగులు, వంకలు, అటవీ ప్రాంతాల్లో బట్టీలు పెట్టి గ్రామాలపైకి నాటు సారాను ఎగజిమ్ముతున్నారు.

కూలుతున్న సంసారాలు..

విషపూరిత రసాయనాలతో తయారు చేసే నాటుసారాను తాగి అమాయక ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గుడుంబా మత్తులో పడి సంపాదించిన డబ్బంతా పోగొట్టుకోవడమే కాకుండా, కుటుంబ పెద్దలు ప్రాణాలు కోల్పోతుండటంతో మహిళలు, చిన్నారులు అనాథలుగా మారుతున్నారు. నిత్యం గొడవలు, హింసతో పల్లెల్లో ప్రశాం తత కరువైందని మహిళలు కన్నీ టిపర్యంతమవుతున్నారు.

ఎక్సైజ్ శాఖ నిఘా ఏదీ?

గుడుంబా తయారీ, రవాణాను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ నిఘా పూర్తిగా గాడితప్పింది. దాడులు నామమాత్రంగా మారిపోవడంతో వ్యాపారులు మరింత బరితెగిస్తు న్నారు. అక్రమ మద్యం స్థావరాలపై ఉక్కుపాదం మోపాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరి స్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యాత్మక గ్రామాల్లో తక్షణమే ప్రత్యేక బృందాలతో విస్తృత తని ఖీలు చేపట్టి, గుడుంబా రవాణా మూలాలను పెకిలించి వేయాలని జిల్లా కలెక్టర్, ఉన్నతాధి కారులను ప్రజలు ముక్తకంఠంతో వేడుకుం టున్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: నిత్యం పట్టణ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం శ్రమించే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ పట్టణంలో మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ఎండ, వాన అని లెక్కచేయకుండా పట్టణ పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపడమే ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నిరంతరం విధులు నిర్వ హించే కార్మికులకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడ తాయని, వారి ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తించి తగిన వైద్య



సలహాలు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్మికుల శ్రేయస్సును కాంక్షించి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ము ందుకు వచ్చిన మాతృశ్రీ, అశ్విని, వర్ష ఆసుపత్రుల యాజమాన్యాలను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. వైద్య శిబిరంలో మున్సిపల్ కార్మికులు, సిబ్బందికి ఉచితంగా వివిధ రకాల వైద్య పరీ క్షలు నిర్వహించి, ఆరోగ్య సంరక్షణపై తగిన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మేనేజర్ సంపత్ రెడ్డి, ప్రముఖ వైద్యులు చీకోటి సంతోష్ కుమార్, సత్యనారాయణ స్వామి, సాయికుమార్, పరమేశ్వర్, ప్రవీణ్ వర్మ, హారిక, అనిల్, శ్రీదేవితో పాటు మున్సిపల్ అధికారులు, కార్మికులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మెడికల్ షాప్‌ల ఇష్టారాజ్యం..!



వివరాలు మెయిన్‌లో...

ఓటుహక్కు పరిరక్షణకు నవంబర్ 1న 'చలోఢిల్లీ'



వివరాలు మెయిన్‌లో...

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు

ప్రజాపక్షం /మల్లాపూర్ : మండలంలోని మొగిలిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 2001–2002 బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు పదవ తరగతి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోగా ఆదివారం ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు.విద్యార్థులంతా కలిసి తాము చదువుకొని విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలకు సేవ చేయాలనే సంకల్పంతో విద్యార్థులంతా కలిసి గ్రంథాలయాన్ని నిర్మించి ఉపాధ్యాయుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భం గా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి పాఠశాల అభివృద్ధికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పూర్వపు ఉపాధ్యాయులు బాపూరావు,రహిమాన్, పద్మాకర్ రావు, సురేష్, శ్రీనివాస్,మురళి, రాందాస్, వెంకటరమణారెడ్డి, స్వామి, నర్సారెడ్డి,మల్లయ్య,2002–2002 పూర్వ విద్యార్థుల బృందం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శారదా విద్యా నిలయం 2000–2001 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించడంతో పాటు పునుగోటి నీరజాకుమారి ప్రత్యేకంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు వివిధ దేశాలు, రాష్ట్రాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం గర్వకారణమని,అందరూ ఐకమత్యంతో ఉంటూ కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

గంగారం కుటుంబానికి బిజెపి నాయకుల ఆర్థిక చేయూత



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తి గ్రామానికి చెందిన బిజెపి బూతు అధ్యక్షుడు తరి గంగారం ఇటీవల మృతి చెందాడు. దీంతో బిజెపి నాయకులు రాపల్లి సురేష్ బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం కలిసి రూ.10,016 చెక్కును అందజేశారు.అనంతరం గంగారం కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన నాయకులు, ఎంపిధర్మపురి అరవింద్ దృష్టికి విషయం తీసుకెళ్లి పార్టీ పరంగా మరింత సహాయం అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పుస్తెం మహేందర్,మలుపు శ్రీను, స్థానిక సర్పంచ్ తరి రామానుజం, చిట్యాల నరేందర్, గుండాల సందీప్,ముద్దం నరసింహ,పొన్నం గణేష్,రంజిత్,రాఖేష్, అజయ్,భూమన్న రెడ్డి,రాధారావు దేవదాస్ ,వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించిన లెక్చరర్లపై అసత్య ప్రచారాలు ఆపాలి

ప్రజాపక్షం /మల్లాపూర్ : 2023 సంవత్సరంలో క్రమ బద్ధీకరించబడిన జూనియర్ లెక్చరర్ల పై కొన్ని చానల్లో వస్తున్న వార్తా కథనాలు పూర్తిగా అవస్తవమని ఇలాంటి అసత్యపు ప్రచారాలు ఆపాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్ 711 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంచర్ల రాజేష్ అన్నారు.సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అధ్యాపకులను క్రమబద్ధీకరించే సమయంలోనే సరైన విద్యార్హతలు, సర్టిఫికెట్లు ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించే క్రమబద్ధీకరించారని, ప్రత్యేకంగా నియమించిన కమిటీల ద్వారానే ఆరుసార్లు వెరిఫికేషన్ జరిగినప్పటికీ మరిన్ని వెరిఫికేషన్లు చేస్తూ అధ్యాపకుల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. అధ్యాపకులపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరైనది కాదని అధ్యాపకుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం మానుకోవాలని,ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన వెరిఫికేషన్ పూర్తి చేసి జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అన్ని అర్హతలు కలిగిన అధ్యాపకులను మానసికంగా వేధిస్తున్న ఓ మీడియా ఛానల్ పై చట్టపరమైన చర్యలు తీసుకునేలా పోరాడుతామన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్‌ది పనికిమాలిన రాజకీయం

బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు



ప్రజాపక్షం / కొత్తపల్లి : కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ పనికిమాలిన రాజకీయం చేస్తోందని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం కొత్తపల్లి మండలంలో నిర్వహించిన పోలింగ్ బూత్ సమావేశం, ప్రధాని నరేంద్ర మోడీ మన్‌కీబాద్ వీక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ఓట్లను, మరణించినవారి ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని అన్నారు. గతంలో కూడా పలుమార్లు సవరణలు జరిగాయని సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. దశాబ్దాలపాటు దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ఓట్ చోరీ చేసే అధికారంలో కొనసాగిందా అని ప్రశ్నించారు. దేశానికి వలస వచ్చి అక్రమంగా ఓటు పొందిన రోహింగ్యాలు, మైనార్టీల ఓట్లు తొలగిస్తున్నారనే నేపంతోనే కాంగ్రెస్ గగ్గోలు చేస్తుందని ఆరోపించారు. నవంబర్ 5న కరీంనగర్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఈ ర్యాలీకి బిజెపి ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి స్మృతి ఇరానీ హాజరవుతున్నట్లు ప్రవీణ్ రావు వెల్లడించారు. ఈ ర్యాలీలో యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుంట తిరుపతి, శక్తి కేంద్ర ఇంఛార్జి వేముల అనిల్ కుమార్, బూత్ అధ్యక్షులు ఎగ్గొజు సంపత్ చారి, బోనాల పరశరాము, గ్రామ సర్పంచ్ నునుగొండ మానస ప్రవీణ్, వార్డు మెంబర్లు రుద్ర రాజ్ కుమార్, పెంట సురేశ్, సీనియర్ నాయకులు మెరుగు మల్లేశం, వరాల మల్లేశం, పెంటి సంతోష్ కుమార్, చందు, రవికుమార్ పాల్గొన్నారు.

కన్స్యూమర్ ఫీల్డ్‌ఫోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అక్కు శ్రీనివాస్



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : కరీంనగర్ కన్స్యూమర్ ఫీల్డ్‌ఫోర్స్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అక్కు శ్రీనివాస్ విజయం సాధించారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు పోటీ పడగా చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. ఓట్ల లెక్కింపు అనంతరం అక్కు శ్రీనివాస్ విజేతగా నిలిచారు. ఎన్నికల్లో మొత్తం 230 ఓట్లు పోలయ్యాయి. వీటిలో అక్కు శ్రీనివాస్‌కు 118 ఓట్లు రాగా చిదురాల రామ్‌మోహన్‌కు 104, రియాజ్‌కు 8 ఓట్లు వచ్చాయి. దీంతో అక్కు శ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి చిదురాల రామ్ మోహన్‌పై 14 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. విజయం అనంతరం అక్కు శ్రీనివాస్ మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తాననే ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిట్టల మధు, మీడియా కన్వీనర్ చిట్టిమల్ల మహేందర్, సమన్వయకర్త తాటిపల్లి గణేశ్, మాజీ అధ్యక్షుడు అరుకుల నాగరాజు, మాజీ కార్యదర్శి మేదిచెలిమి శేఖర్, సలహాదారుడు దూలం మల్లిక్, న్యాయ సలహాదారు కాదర్ల శ్రీనివాస్, ఎన్నికల కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రీమియర్ లీగ్ సీజన్ 2 – ఫైనల్ విజేతగా భోజన్నా



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో గత పది రోజులుగా అత్యంత ఉత్కంఠభరితంగా స్ాగిన గొల్లపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ పోటీలు ఆదివారం నాటి ఫైనల్ మ్యాచ్‌తో ముగిశాయి. గొల్లపల్లి, బుగ్గారం, ఉమ్మడి వెల్గటూర్ మండలాల గ్రామీణ క్రీడాకారులలోని ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రముఖ సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి ఈ టోర్నమెంట్‌ను ప్రతిష్టాత్మకంగా స్పాన్సర్ చేశారు.ఈ టోర్నమెంట్‌లో మూడు మండలాల నుండి మొత్తం 10 జట్లు పాల్గొని తల పడ్డాయి.ఆదివారం జరిగిన హోరాహోరీ ఫైనల్ మ్యాచ్‌లో భోజన్నా వారియర్స్ మరియు విక్టరీ వాల్తేర్ జట్లు తలపడగా ఇరు జట్లు అద్భుతమైన ప్రతిభను కనబరిచాయి. చివరి వరకు రసవత్తరంగా సాగిన ఈ పోరులో విక్టరీ వాల్తేర్ జట్టుపై భోజన్నా వారియర్స్ జట్టు విజయం సాధించి జీపీఎల్ సీజన్2 ట్రోఫీని కైవసం చేసుకుంది. మ్యాచ్ అనంతరం జరిగిన బహుమతుల ప్రధానోత్సవంలో ముఖ్య అతిథి,టోర్నీ స్పాన్సర్ ఎడమల భోజేందర్ రెడ్డి విజేతగా నిలిచిన భోజన్నా వారియర్స్ జట్టుకు అలాగే రన్నరప్‌గా నిలిచిన విక్టరీ వాల్తేర్ జట్టుకు ప్రైజ్ మనీతో పాటు ట్రోఫీలను అందజేశారు. క్రీడలు యువతలో క్రమశిక్షణను ఏకత్వాన్ని పెంపొందిస్తాయని గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ,ఇస్రాజ్ పల్లె సర్పంచ్ గోస్కుల జలంధర్, పీఏసీఎస్ చైర్మన్ గాంధే మాధవరావు,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు దాసరి తిరుపతి గౌడ్, సర్పంచ్‌లు సిద్ధెంకి లక్ష్మీ మల్లారెడ్డి, కాశ గంగాధర్ ,జెల్ల అనిల్ ,ఉప సర్పంచ్‌లు గురిజాల బుచ్చిరెడ్డి, చెవుల తిరుపతి,గుర్రం రంజిత్,క్యాతం రవీందర్ రెడ్డి,నాయకులు ఎరవేని రమేష్, కనుకుట్ల లింగారెడ్డి, భీమ సత్యం,గాదే హన్మాండ్లు,టోర్నమెంట్ నిర్వాహకులు సంతోష్,చందు ,క్రీడాభిమానులు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ : జగిత్యాల పట్టణంలోని జ్యోతి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని కట్ట వాసవి అండర్–17 బాక్సింగ్ విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లా ఉప్పల్‌లోని డివి బాక్సింగ్ అకాడమీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొననుంది.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ బియ్యాల హరిచరణ్ రావు వాసవిని అభినందించి, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయం సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాల నిఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యులకు ఘన సన్మానం

ప్రజాపక్షం / కొత్తపల్లి :ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఇటీవల గెలుపొంది నియామకమైన సామాజికవేత్త, ప్రముఖ ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సాయినేని నరేందర్‌లను దక్షిణ కాశి వేములవాడ శ్రీ రాజరాజేశ్వరి మున్నూరు కాపు సత్రం వ్యవస్థాపకులు, పటేల్స్ సంఘం అధ్యక్షులు, రాష్ట్ర బీసి సంఘం కన్వీనర్ డా.కొండా దేవయ్య ఘనంగా సత్కరించారు. శ్రీ రాజరాజేశ్వరి స్వామి ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా కోల అన్నారెడ్డి వేములవాడలో గల నిత్యాన్నదాన మున్నూరు కాపు సత్రం ఉపాధ్యక్షుడిగా కూడా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. మరెన్నో సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు సేవలందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, కర్నె రాజమౌళి, సత్రం ఆర్గనైజింగ్ కార్యదర్శి చిలుక రమేశ్ శుభాకాంక్షలు తెలిపారు.

బెజ్జంకి ఎఎంసి నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సన్మానం



ప్రజాపక్షం / తిమ్మాపూర్ : మానకొండూర్ నియోజకవర్గ పరిధిలోని బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు ఆదివారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ కార్యాలయంలో మానకొండూర్ ఎమ్మెల్యే, టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్ డా.కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాతంగి శిరీష్ అనిల్, వైస్ చైర్మన్ పర్వ సంతోష్‌తోపాటు డైరెక్టర్లు జిల్లా రాజేశ్వరి, దేశరాజు అనిల్, సందికొండ తిరుపతి రెడ్డి, మైసంపల్లి తిరుపతి, ఇస్కిల్ల ఐలయ్య, జీల లింగం, రెడ్డి రామకృష్ణారెడ్డి, ముహ్మద్ సాదిక్, కుంట హరికృష్ణ, ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి కృష్ణారావు, గుండా వెంకట్ రెడ్డిలను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాంపెల్లి శ్రీనివాస్, చైర్మన్ ఒగ్గు దామోదర్, పార్టీ నాయకులు ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాభారతిలో ఘనంగా అన్నమయ్య గానామృతం



ప్రజాపక్షం/కొత్తపల్లి : కరీంనగర్‌లోని కళాభారతి వేదికగా ఆదివారం శ్రీ మేధా సంగీత శిక్షణాలయంలో కిట్టూ ఈవెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య గానామృతం కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రవీందర్‌కు చెందిన రాగవర్ధిని సంగీత బృందం తన అద్భుతమైన గానంతో ప్రేక్షకులను ఆ కట్టుకున్నారు. మొత్తం 15 సంగీత బృందాలు పాల్గొన్న ఈ కార్యక్రమం శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తి గీతాలతో మారుమోగింది. అన్నమయ్య కీర్తనల ఆలాపనతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని సంగీత ప్రియులకు భక్తిభావాన్ని పంచింది.

ఆశల 'గూడు'పై నీలినీడలు.. ఇందిరమ్మ బిల్లులకు బ్రేకులు!

ప్రజాపక్షం/జైనూర్ः పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జైనూర్ మండలంలో బిల్లులు రాక ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మండలానికి మొత్తం 563 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 182 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే పూర్తయిన ఇళ్లలో కేవలం 8 మందికి మాత్రమే బిల్లులు చెల్లించగా, మిగిలిన 174 మందికి బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మరోవైపు వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 381 ఇళ్లకు కూడా నయాపైసా అందకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

అప్పులపాలు అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలు

సొంతింటి ఆశతో లబ్ధిదారులు అప్పులు తెచ్చి, చేతిలో ఉన్న కొద్దిపాటి నగదుతో పునాదులు తీసి నిర్మాణాలు ప్రారంభించారు. ప్రభుత్వం నిర్దేశించిన దశల ప్రకారం పనులు చేపట్టినా నిధులు విడుదల కాకపోవడంతో తదుపరి పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. ఇటుకలు, ఇనుము వంటి సామగ్రి కొనుగోలుకు డబ్బుల్లేక, అటు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాయి. సకాలంలో నిధులు చేతికి అందకపోతే ఇళ్లు ఎలా పూర్తి చేయాలని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ చొరవతోనే మోక్షం

మండలంలో నత్తనడకన సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏయే దశల్లో ఎన్ని బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయో క్షేత్రస్థాయిలో సమీక్షించి, బాధితులకు తక్షణమే బిల్లులు విడుదల య్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అర్ధాంతరంగా నిలిచిన నిర్మాణాలను తిరిగి ప్రారంభించేందుకు వేగంగా స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మన్ కీ బాత్ సామాన్యుల విజయగాథలకు జాతీయ వేదిక

ప్రజాపక్షం/నిజామాబాద్ ः ఇందూరు సామాన్యుల విజయ గాథలకు జాతీయ వేదికగా 'మన్‌కీ బాత్' నిలుస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం పిఎం మోడీ 'మన్ కీ బాత్' 139వ ఎపిసోడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ దేశ ప్రజలకు కృషి, సేవా స్ఫూర్తి, ఆవిష్కరణలు, దేశీయ ప్రతిభను దేశవ్యాప్తంగా పరిచయం చేయటం కార్యక్రమ ప్రత్యేకత అని తెలిపారు. 12 సంవత్సరాలుగా నిరంతరాయంగా కొనసాగుతున్న మన్ కీ బాత్ ప్రజలకు, పిఎంకు మధ్య ఒక ఆత్మీయ వారధిగా నిలిచిందన్నారు. ఈ ఎపిసోడ్‌లో పంజాబ్‌లోని మాల్వా ప్రాంతంలో సహజ పత్తి సాగును ప్రోత్సహిస్తున్న 'సవ్‌త్రిం జన్' కార్యక్రమాన్ని ప్రధాని ప్రశంసించడం విశేషమన్నారు. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను పునరుద్ధరించటంతో పాటు చేనేత నైపుణ్యాలను భావితరాలకు అందించడం, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని వివరించారు. అలాగే ఉత్తరాఖండ్‌లోని హేవల్ నదిని పునరుజ్జీవింపజేయడానికి స్థానిక ప్రజలు, అధికారులు కలిసి చేపట్టిన వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, మొక్కల పెంపకం కార్యక్రమాలను



ప్రధాని ప్రస్తావించటం పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో తెలియజేస్తోందన్నారు. రాబోయే దీపావళి పండగ సందర్భంగా స్థానిక కళాకారులు, చేతివృత్తుల వారు, చిన్న వ్యాపారులు తయారుచేసిన స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని ఇచ్చిన పిలుపు ప్రతి భారతీయుడు ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 'మన్ కీ బాత్' కేవలం రేడియో కార్యక్రమం మాత్రమే కాదని, దేశంలోని మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభను గుర్తించి, సమాజానికి సేవ చేస్తున్న వ్యక్తులను కోట్లాది మందికి పరిచయం చేసే గొప్ప వేదిక అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుధీర్, నాయకులు పవన్, కృష్ణ పాల్గొన్నారు.

పోలీసులంతా ఒకే కుటుంబం..

అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్

ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : పోలీసులు ఒకే కుటుంబం... వారు వేసుకున్న యూనిఫాం అందరికి గర్వ కారణమని వారి త్యాగాల వల్ల నేడు మనం గర్వంగా బతుకుతున్నామని అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ అన్నారు. ఆదివారం పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైకిల్ / బైక్ ర్యాలీని అదనపు డిసిపి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ ఉదయం 8 గంటలకు పూలాంగ్ చౌరస్తా నుండి ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీ ప్రగతి హాస్పిటల్, ఎల్‌ఐసి చౌరస్తా, కోర్టు చౌరస్తా, ఎన్‌టిఆర్ చౌరస్తా, పోలీసు హెడ్ క్వార్టర్స్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో పోలీసు సిబ్బంది అంతర్గత భద్రత కాపాడటానికి నక్సలైట్లు, మతపరమైన విభజన శక్తులు, ఇతర సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటు నేరాల అరికట్టడం, మాదక ద్రవ్యాల అణచివేయడానికి, మహిళ భద్రతకు, తమ



ప్రాణాలు అర్పించారని అన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని, ఎక్కడ ఎలాంటి సంఘటన చోటుచేసుకున్నా, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిఐలు, రిజర్వు ఇన్స్‌పెక్టర్లు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఆర్మూడ్ రిజర్వు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోట్లు వెచ్చించి నిర్మించిన బైపాస్.. లారీలకు పార్కింగ్ స్థలం

ధరూర్ క్రీడా ప్రాంగణం నుంచి బైపాస్ మలుపుల వరకు టిప్పర్లు,లారీల నిలుపుదలతో ఇబ్బందులు

అధికారుల స్పందన కరువు.. జరిమానాల హెచ్చరికలు ప్లెక్సీలకే పరిమితం

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో భారీ వాహనాల రాకపోకలతో ఏర్పడే ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు కోట్లు వెచ్చించి నిర్మించిన బైపాస్ రహదారి లక్ష్యం నీరుగారుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధరూర్ గ్రామం నుంచి చెల్గల్ గ్రామం వరకు ఏర్పాటు చేసిన ఈ రహదారిపై, ముఖ్యంగా మలుపుల వద్ద టిప్పర్లు,లారీలను నిలిపివేయడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు,స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా, కోరుట్ల, మెట్‌పల్లి,ఆర్మూర్,నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు నిర్మించిన బైపాస్ రహదారే ప్రస్తుతం భారీ వాహనాల పార్కింగ్‌కు వేదికగా మారడం చర్చనీయాంశంగా మారింది.

ధరూర్ క్రీడా ప్రాంగణం లారీల అడ్డాగా మారిందా..? జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్ గ్రామ క్రీడా ప్రాంగణం పరిసరాల్లోనూ టిప్పర్లు, లారీల నిలుపుదల కనిపిస్తుండటంతో క్రీడా స్థలం వినియోగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. యువత ఆటలాడుకునేందుకు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉపయోగపడాల్సిన ప్రాంగణాన్ని భారీ వాహనాల పార్కింగ్‌కు వినియోగించేందుకు అనుమతులు ఉన్నాయా.? ఉంటే ఏ నిబంధనల ప్రకారం అనుమతించారు.? లేక అనుమతులు లేకుండానే వాహనాలను నిలుపుతున్నారా.? అనే అంశాలపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. మరోవైపు భారీ వాహనాల నిలుపుదలపై జరిమానాలు విధిస్తామని హెచ్చరిస్తూ ప్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో నిబంధనలు అమలవుతున్నాయా.? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. హెచ్చరికలకే పరిమితమవకుండా నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పత్రికా కథనాలకైనా స్పందన కరువే.. చర్యలు ఎప్పుడో మరి : బైపాస్ రహదారిపై భారీ వాహనాల నిలుపుదల, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై



బైపాస్ రోడ్డుపై లారీలు.. వాహనదారులకు తిప్పలు

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా కేంద్రంలో హెవీ మోటార్ల్ రాకపోకలతో ఏర్పడే ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామం నుంచి చెల్గల్ వరకు బైపాస్ రహదారిని నిర్మించారు. కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే, అటు వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్ళే భారీ వాహనాలు ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే బైపాస్ రహదారి మలుపు వద్ద టిప్పర్లు, లారీలు పెద్ద సంఖ్యలో నిలిపివేస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ధరూర్ ఎస్.ఆర్.ఎస్.పి కెనాల్ నుంతెనకు ధరూర్, టీఆర్ నగర్ వైపు జగిత్యాల–కరీంనగర్ రహదారిపై ఉన్న గుంతల సమస్య వాహనదారులను మరింత తీవ్రతరం చేస్తున్నాయి. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అటూ ఇటూ వెళ్లాల్సి రావడం, అదే సమయంలో మలుపు వద్ద లారీలు, టిప్పర్ నిలిని ఉండటంతో ప్రమాదాలకు అస్కారం ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

సమస్య వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, బైపాస్ మలుపుల వద్ద వాహనాల నిలుపుదలను నియంత్రించడంతోపాటు ధరూర్ క్రీడా ప్రాంగణం వినియోగంపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు. పోలీసు, రహదారుల నిర్వహణ, గ్రామపంచాయతీ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోట్లు వెచ్చించి నిర్మించిన బైపాస్ రహదారి ప్రజలకు ఉపయోగపడుతుందా.? లేక టిప్పర్లు, లారీల పార్కింగ్‌కే పరిమితమవుతుందా.? అన్న ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాజీ వార్డు సభ్యురాలుకి సర్పంచ్ పరామర్శ ఐదువేల ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన దాసరి పురుషోత్తం సతీమణి భాగ్యమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆమె మరణంతో ఓడేడు గ్రా మంలో విషాద ఛాయలు అలముకున్నాయి. భాగ్య మరణవార్త తెలుసుకున్న గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి వెంటనే బాధిత కుటుంబాన్ని సందర్శించి పరామర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.అనంతరం అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం సర్పంచ్ తన సొంత నిధుల నుండి రూ.5,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. భాగ్యమ్మ మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

కమ్యూనిస్టు యోధుడు గట్టెపల్లి భూమయ్యకు నివాళి

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: కమ్యూనిస్టు యోధుడు గట్టెపల్లి భూమయ్యకు వెంకటాపురం గ్రామస్థులు నివాళులు అర్పించారు అయన వయోభారంతో శనివారం మృతిచెందారు. వెంకటపురం సర్పంచుగా గతంలో మూడుసార్లు భాద్యతలు నిర్వహించి ప్రజల మన్ననలను పొందారు. ప్రజలకు సేవలు అందించిన గట్టెపల్లి భూమయ్యకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య సంతాపం వ్యక్తం చేశారు.మాజి సర్పంచ్ భూమయ్య కూతురు బుర్కభాగ్యను పరామర్శించి ఓదార్చారు.కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారికి అండగా ఉంటామని ప్రజాప్రతినిధులు సింగిల్‌విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి,అందెసుభాష్,వర్సకృష్ణ,ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనుగందుల నర్సింలు,ఎలుసాని మోహన్‌కుమార్,శ్రీనివాస్,పిల్లికి షన్,భూమయ్యకు నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

రైతులకు అందించిన సేవల గాను దక్కిన అరుదైన గుర్తింపు

రైతులకు మరింత మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజా పక్షం/సుల్తానాబాద్ ः సుల్తానాబాద్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతులకు అందించిన విశిష్ట సేవలకు గాను అరుదైన గుర్తింపు లభించింది. సంఘం అధ్యక్షుడు (శీగిరి శ్రీనివాస్ యొక్క కృషి సంఘం కార్య నిర్వహణ అధికారి సంతోష్ యొక్క పట్టుదలతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పాక్స్‌ఎఫ్ పి ఓ) పనితీరుపై నిర్వహించిన మూల్యాంకనంలో సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్)79 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది.రైతులకు సకాలంలో పంట రుణాల మంజూరు, ఎరువులు, విత్తనాల సమర్థవంతమైన సరఫరా, ధాన్యం సేకరణలో పారదర్శకత, వ్యాపార వైవిధ్యీకరణ, రుణాల వసూళ్లలో మెరుగైన పనితీరు, డిజిటలైజేషన్‌తో పాటు ఉత్తమ నిర్వహణ ప్రమాణాలను పాటించినందుకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించినట్లు సంఘం అధికారులు తెలిపారు.పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన తెలిపారు.సుల్తానాబాద్ ప్యాక్స్ సాధించిన ఈ విజయంపై సంఘ సభ్యులు, స్థానిక రైతులు, పాలకవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.సంఘం అభివృద్ధికి సహకరించిన అధికారులు,సిబ్బంది, రైతులకు సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

యువ మేదరి మహేంద్ర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాపక్షం / జన్నారంः యువ మేదరి మహేంద్ర సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఒడిపెళ్లి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కోశాధికారిగా చింత రమణ, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో మహేంద్ర సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకెళ్తామని స్పష్టం చేశారు. మహేంద్ర సంఘం అధ్యక్షుడు ఎఎంఆర్ నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరి నర్సయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూరినేని కొండయ్య, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంద గోపాల్, మాజీ అధ్యక్షుడు పర్ల శంకర్, సంద కృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి చిలువేరి సుధీర్ కుమార్, నాయకులు మదిరె సతీష్, కనికరపు రాకేష్, సురేష్ పాల్గొన్నారు.

అత్యవసర వేళ.. అండగా నిలిచిన నాయకుడు



కోదురుపాక మహేష్

ప్రజాపక్షం/వాంకిడి: అత్యవసర సమయంలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు రక్తదానం చేసి సిపిఐ వాంకిడి మండల కార్యదర్శి కోదురుపాక మహేష్ ప్రాణదాతగా నిలిచారు. వాంకిడి మండలంలోని సోనాపూర్ గ్రామానికి చెందిన కిన్నాక శ్రీదేవి అనారోగ్యంతో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు అత్యవసరంగా రక్తం అవసరమని తెలుసుకున్న మహేష్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకొని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో స్పందించి తోటివారి ప్రాణాలు నిలబెట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి చేతనైన సహాయం అందించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, అర్హులైన యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఆపత్కాలంలో స్పందించి ప్రాణదాతగా నిలిచిన మహేష్‌ను బాధితురాలి భర్త రాముతో పాటు స్థానికులు, పలువురు ప్రముఖులు అభినందించారు.

సిఎం అండతోనే ఎంఎల్ఏ ప్రేమ్ సాగర్ రావు అరాచకాలు

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి



ప్రజాపక్షం/మంచిర్యాల: సిఎం రేవంత్ రెడ్డి అండతోనే మంచిర్యాల ఎంఎల్ఏ ప్రేమ్ సాగర్ రావు అరాచకాలకు పాల్పడుతున్నారని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, బిజెపి నాయకులు, కార్పోరేటర్ ముఖేష్ గౌడ్ ఆరోపించారు. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మంచిర్యాల ఎంఎల్ఏ వర్గం, మంత్రి వివేక్ వర్గం మధ్య జరుగుతున్న దాడులతో జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నాఅక్రమ కేసులు బనాయిస్తున్నా ముఖ్యమంత్రి, పోలీస్ యంత్రాంగం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రి బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రికి వసూళ్లపై ఉన్న శ్రద్ధ శాంతిభద్రతలను కాపాడటంలో లేదని విమర్శించారు. ప్రజాప్రతినిధి కాని వ్యక్తికి 300 మంది పోలీసులతో రక్షణ కల్పించడం వెనుక ఎవరి అండ ఉందో సిఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న మంచిర్యాలలో అలజడి సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఎంఎల్ఏ ప్రేమ్ సాగర్ రావు, కాంగ్రెస్ నాయకులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌టిసి భూముల స్వాధీనంపై మజ్దూర్ యూనియన్ ఆగ్రహం

జిఒ 206 ఉపసంహరణకు డిమాండ్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ముషీరాబాద్ ఆర్‌టిసి డిపోకు చెందిన 6 ఎకరాల 15 కుంటల అత్యంత విలువైన భూమిని ఎల్ఐజి/ఎంఐజి క్వార్టర్ల నిర్మాణానికి స్వాధీనం చేసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ.నెం.206 ను ఆర్‌టిసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఏఆర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం ఆర్‌టిసి సంస్థ భవిష్యత్తు మనుగడకే తీవ్ర విఘాతం కలిగిస్తుందని, సంస్థ ఆస్తులను కాపాడుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని యూనియన్ రాష్ట్ర కమిటీ స్పష్టం చేసింది.

ఏకపక్ష స్వాధీనం చట్ట విరుద్ధం : ఆర్‌టిసి భూములు మరియు ఆస్తులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పడ్డాయని, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ ప్రకారం ఇవి ఇంకా ఉమ్మడి ఆస్తులుగానే పరిగణించబడతాయని యూనియన్ నాయకులు గుర్తుచేశారు.

సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర : ఆర్‌టిసి సంక్షేమం, కార్మికుల పరిరక్షణ అంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమయ్యాయని యూనియన్ ఆరోపించింది. సొంత బస్సుల కొనుగోలు నిలిపివేసి, ప్రైవేట్, విద్యుత్ మరియు అద్దె బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా సంస్థను నిర్వీర్యం చేసే ప్రక్రియ ఇప్పటికే మొదలైందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్‌టిసికి చెల్లించాల్సిన బకాయిలను స్పష్టం చేయకుండా, ప్రభుత్వం సంస్థను ఆర్థిక భారంగా చూడటం శోచనీయమని పేర్కొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి: ఆర్‌టిసి ఆస్తులు కార్మికుల త్యాగాలు మరియు దాతల దాతృత్వంతో సమకూరినవని, వాటిని ప్రైవేట్ వ్యక్తులు లేదా ఇతర ప్రయోజనాల కోసం దారాదత్తం చేయడాన్ని సహించేది లేదని హెచ్చరించారు.

జిఒను రద్దు చేయకపోతే పోరాటం తీవ్రతరం : విలువైన ఆస్తులను హస్తగతం చేసుకునేందుకు ప్రభుత్వం జారీ చేసిన జిఒ.నెం.206 ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు, ప్రజలు మరియు ప్రజాసంఘాల భాగస్వామ్యంతో తీవ్రస్థాయిలో నిరసన పోరాటాలు చేపడతామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ హెచ్చరించింది.

దేగాంగ్ గ్రామంలో వర్ష వాస్ ముగింపు వేడుకలు



ప్రజాపక్షం/భైంసా: నిర్మల్ జిల్లా బైంసా మండలం దేగాం గ్రామంలో వర్షా వాస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నలంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు కపిల్ వాగ్మారే మాట్లాడుతూ, బుద్ధుని బోధనల స్ఫూర్తితో వర్షావాస్ ప్రాధాన్యతబుద్ధుని కాలం నుంచి కొనసాగుతున్న వర్షావాస్ సంప్రదాయం, ధ్యానం, ధర్మబోధన, అహింసకు ప్రతీక బౌద్ధ ధర్మంలో వర్షావాసానికి ప్రత్యేక మైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంది. గౌతమ బుద్ధుని కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం బౌద్ధ భిక్షువుల జీవితంలో క్రమశిక్షణ, ధ్యానం, ధర్మ అధ్యయనం,ఆత్మపరిశీలనకు ఎంతో దోహదపడింది. వర్షాకాలంలో నిరంతరం ప్రయాణాలు చేయకుండా ఒకే ప్రాంతంలో నివసిస్తూ ధర్మ సాధన చేయడమే వర్షా బాస్ ప్రధాన ఉద్దేశం పేర్కొన్నారు. గడ్ పాలె బాబు మాట్లాడుతూ, బుద్ధుని జీవితంలోగౌతమ బుద్ధుడు జీవించిన ప్రాచీన భారతదేశంలో వర్షాకాలంలో ప్రయాణాలు చేయడం కష్టంగా ఉండేది. అంతేకాకుండా వర్షాల కారణంగా మొలకెత్తే మొక్కలు, చిన్నచిన్న జీవులకు హాని కలగకుండా ఉండాలనే అహింసా భావనకు కూడా ప్రాధాన్యత ఉండేది.ఈనేపథ్యంలో బౌద్ధ భిక్షువులు వర్షాకాలంలో ఒకే ప్రాంతంలో నివసించే సంప్రదాయాన్ని బౌద్ధ సంఘంలో బుద్ధుడు ఆచరణలోకి తీసుకొచ్చారు. ఈ ఆచారం వినయ పిటకంలోని నియమాల్లో ప్రస్తావించబడింది. సాధారణంగా వర్షావాసం మూడు నెలలపాటు కొనసాగుతుంది. ఈ సమయంలో భిక్షువులు ధ్యానం చేయడం, బుద్ధుని బోధనలను అధ్యయనం చేయడం,ధర్మ చర్చలు నిర్వహించడం, తమ ప్రవర్తనను సమీక్షించుకోవడం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సమయం కేటాయిస్తారు. బుద్ధుని బోధనల్లోని జీవిత సత్యాలుగౌతమ బుద్ధుడు మానవ జీవితంలో దుఃఖానికి గల కారణాలను అర్థం చేసుకొని, వాటి నుంచి విముక్తి పొందేందుకు మార్గాన్ని బోధించారు. కోరికలు, ద్వేషం, అజ్ఞానం మనిషి జీవితంలో అశాంతికి,కారణమవుతాయని బౌద్ధ బోధనలు వివరిస్తాయి. మధ్యమ మార్గం, అహింస, కరుణ, మైత్రి, సమానత్వం, సత్యనిష్ఠ బౌద్ధ ధర్మంలోని ముఖ్యమైన విలువలు. మనిషి తన ఆలోచనలు, మాటలు, చేతలను నియంత్రించుకోవడం ద్వారా ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చనే సందేశాన్ని బుద్ధుని బోధనలు అందిస్తాయి. వర్షావాసం ఈ విలువలను ఆచరణలో పెట్టేందుకు ఒక ప్రత్యేక అవకాశంగా నిలుస్తుందిపేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి,ఉపసర్పంచ్ బాలేకర్ శివాజీ, వార్డ్ మెంబర్ వాగ్మారే సుప్రియ సిద్ధోధన్,పాత్రికేయులు గంగాధర్,రిటైర్డ్ ఉపాధ్యాయులు దిగంబర్,విద్యా వాలంటర్ వాగ్మారే లక్ష్మణ్, బుద్ధ నగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

కనకాపూర్‌లో విద్యుత్ మరమ్మతులు!

మాజీ సర్పంచ్ సాలయి నరేష్ ఫిర్యాదుతో స్పందించిన విద్యుత్ అధికారులు



ప్రజా పక్షం/లోకేశ్వరం: కనకాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలోని విద్యుత్ స్తంభాలు, తీగల కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గతంలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, శ్రీ దుర్గామాత ఉత్సవాల సమయంలో విద్యుత్ తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామ మాజీ సర్పంచ్ సాలయి నరేష్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.మాజీ సర్పంచ్ చేసిన ఫిర్యాదుపై స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది తాజాగా గ్రామంలో మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా 9 మీటర్ల విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లను సరిచేసే పనులు చేపట్టారు.దీంతో గ్రామంలో విద్యుత్ తీగల వల్ల ఎదురయ్యే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నట్లయింది. విద్యుత్ అధికారుల కు కృతజ్ఞతలు ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ సాలయి నరేష్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల భద్రత కోసం తాము గతంలో చేసిన ఫిర్యాదుపై స్పందించి మరమ్మతు పనులు చేపట్టిన విద్యుత్ శాఖ అధికారులకు,స్థానిక లైన్మెన్‌కు,విద్యుత్ సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.గ్రామంలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ప్రజల భద్రతే లక్ష్యంగా విద్యుత్ శాఖ చేపట్టిన ఈ మరమ్మతు పనులపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేకల కాపరి కుటుంబాన్ని పరామర్శించిన సిపిఎం నాయకులు

ప్రజాపక్షం/పెంబి: మండలంలోని తాటి గూడ గ్రామ నివాసి ఆదివాసి కొలాం మేకల కాపరి ఆత్రం శేషరావు కుటుంబాన్ని ఆదివారం సిపిఐఎం గిరిజన సంఘం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగింది. మేకల కాపరి ఆత్రం శేషరావును మేకలు మేపుతుండగా పెంబి తండ నివాసి అయినటువంటి పెంబి ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్ ప్రతాప్ నాయక్ తీవ్రంగా కొట్టిన విషయం ప్రజలకు తెలిసిందే. ఫారెస్టు అధికారులు ప్రతాప్ నాయక్ కొట్టలేదని చెబుతున్నారు. ప్రతాప్ నాయక్ మేకల కాపరిని కొట్టి తర్వాత వీడియో తీయించాడు. ప్రతాప్ నాయక్ కొట్టకపోతే వీడియో తీయించే అవసరం ఏమొచ్చింది.నీ కాళ్లు చేతులు మంచిగా ఉన్నాయి కదా అని కూడా ప్రతాప్ నాయక్ మాట్లాడిన తీరు మేకల కాపరిని కొట్టాడనే విషయాన్ని తేటతెల్లని చేస్తుంది. ప్రతిరోజు అడవిలో మేకలని మేపుకొని మేకల కాపరిగా ఇతరులకు పాలేరుగా జీవనం కొనసాగిస్తున్న ఆత్రం శేషారావు తీవ్రమైన దెబ్బలు తిని సరిగా నడవలేని స్థితిలో నేటికీ కట్టే పట్టుకొని నడుస్తున్నాడు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఈ కుటుంబాన్ని సందర్శించి వారికి న్యాయం జరిగేంతవరకు పోరాటంలో కలిసి రావాలని కోరుతున్నారు. మేకల కాపరికి న్యాయం జరిగేంతవరకు మేకల కాపరి కుటుంబాన్ని కలెక్టర్ కార్యాలయం ముందు నిరవధిక ధర్నాకు సిద్ధం చేస్తాం. ఈ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సిపిఐ ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోడసం శంభు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుప,తి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు కుకరికారుల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుంచుల నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో ప్రసాదాల సరుకుల మళ్లింపు ఆరోపణలు!

స్టోర్ ఇన్‌చార్జి రాజేందర్ సస్పెన్షన్

ప్రజాపక్షం/ముధోల్(బాసర): నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో ప్రసాదాల తయారీకి వినియోగించే సరుకుల మళ్లింపు ఆరోపణలు కలకలం రేపాయి. ఈ వ్యవహారంలో స్టోర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆలయ ఉద్యోగి రాజేందర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఆలయంలో ప్రసాదాల తయారీ కోసం నిల్వ ఉంచిన సరుకులు మాయమవుతున్నాయనే ఆరోపణలు రావడంతో దేవస్థానం అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా సంబంధిత ఉద్యోగికి షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అయితే ఆయన ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు సమాచారం. రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. స్టోర్ ఇన్‌చార్జి సస్పెన్షన్ చేసిన విషయం వాస్తవమేనని బాసర ఆలయ ఇఒ అంజనాదేవి ధ్రువీకరించినట్లు సమాచారం. ప్రసాదాల తయారీకి సంబంధించిన సరుకుల నిల్వలు, వాటి వినియోగం, పంపిణీ వ్యవహారాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

అంగరంగ వైభవంగా దుర్గాదేవి ఉత్సవ విగ్రహ నిమజ్జన శోభాయాత్ర



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయంలో ఆదివారం దుర్గామాత ఉత్సవ విగ్రహ సామూహిక నిమజ్జనం ఆలయ వ్యవస్థాపకులు కొండాజి వెంకటాచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నిమజ్జన శోభాయాత్రకు పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకటాచారి మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు శ్రీగిరి నందిగుండం దుర్గామాత ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించామని మహారాష్ట్ర నిజామాబాద్ ఆదిలాబాద్ జిల్లాల నలుమూలల నుంచి వేలాదిమంది అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సేవలందించిన వారందరికీ ఆ అమ్మవారి కృప కటాక్షములు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంగా మాత శ్రీనివాస్, ఆలయ పూజారులు భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంపై అలుపెరుగని పోరాట యోధుడు గుజ్జ రమేష్

కార్మిక లోకానికి తీరని లోటు

సంతాప సభలో ఘన నివాళులు



ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్ ః అన్యాయం ఎక్కడ జరిగినా ఎదిరించి నిలబడిన కార్మిక వర్గ పోరాట యోధుడు, సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు గుజ్జ రమేష్ అకాల మరణం కార్మిక లోకానికి తీరని లోటని తెలంగాణ సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య పేర్కొన్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన గుజ్జ రమేష్‌కు నివాళులర్పిస్తూ ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గజెల్లి వెంకటయ్య మాట్లాడారు. రమేష్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి, జోహార్లు అర్పిస్తూ నివాళులు అర్పించారు. బెల్లంపల్లి బాబు క్యాంపులో నివసించిన గుజ్జ రమేష్ సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కార్మికుల హక్కుల కోసం, బాధితులకు న్యాయం చేయడం కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. 1978 జూన్‌లో బెల్లంపల్లిలో చోటుచేసుకున్న రాజేశ్వరి హత్య ఘటనపై న్యాయం చేయాలంటూ సాగిన ఉద్యమంలో రమేష్ కీలక పాత్ర పోషించారని వివరించారు. రాడికల్ యువజన సంఘం సానుభూతిపరుడిగా ఉద్యమంలో చురుగ్గా పాల్గొని అక్రమ కేసులను ఎదుర్కొన్నారని తెలిపారు. జన నాట్య మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య కార్యక్రమాల్లో భాగంగా భూభాగోతం నాటకంలో దొర పాత్ర పోషించి ప్రజల్లో చైతన్యం తెచ్చారని కొనియాడారు. కార్మికుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన సాగించిన పోరాట స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, నాయకులు పి. రాంరెడ్డి, పోతురాజుల చంద్రయ్య, చిప్ప రామస్వామి, అడిచర్ల రాజేశం, గోపతి లక్ష్మణ్, బూర్ల జ్ఞాని, బి. లక్ష్మీ నారాయణ గౌడ్, శేషంకరావు, పైడిమల్ల రాజలింగు, టి. జనార్దన్ స్వామి, నల్ల తీగల ఓదేలు, ఆషాఢపు రాములు, లక్కాకుల లచ్చన్న, మోతుకూరి రాంబాబు, గుజ్జ చందర్ పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశం వాయిదా

ప్రజాపక్షం / కాసిపేట: కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ నిర్మాణంతో సోమగూడెం నుంచి కాసిపేట మండలానికి వెళ్లే ప్రధాన రహదారిని శాశ్వతంగా కొనసాగించాలనే డిమాండ్‌తో ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం వాయిదా పడింది. ఐక్య సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భేటీకి కొంత మంది సర్పంచులు, ముఖ్య నాయకులు హాజరుకాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు హాడక్ కమిటీ నాయకులు తెలిపారు. తదుపరి సమావేశాన్ని నవంబర్ 1 ఆదివారం నాడు నిర్వహించడంతో పాటు నూతన కమిటీని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు వెల్లడించారు. మండలంలోని సర్పంచులు, నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కరెంటు లేక ఎండిపోతున్న పంటలు

ప్రజాపక్షం/ నర్సంపేట : కరెంట్ లేక పంటలన్ని ఎండిపోతున్నాయని, ఎలాంటి కోతలు లేకుండా వ్యవసాయానికి కరెంట్ సరఫరా చేయాలని బిఆర్ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జీ మోటూరి రవి అన్నారు. నర్సంపేట మండలంలోని గురిజాల గ్రామంలో బిఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బావుల కింద ఎండిపోతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి మాట్లాడుతూ గురిజాలలో చాలా మంది రైతులు వరి, ఇతర పంటలు సాగు చేశారని నీళ్లు లేక పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం స్పందించి ఎలాంటి కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అధికారుల ద్వారా సర్వే చేయించి నష్టపరిహారం రైతులకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు చిన్నపెళ్లి నర్సింగం, మాజీ ఎంపిటిసిలు గడ్డం కొమురయ్య, బండారి రమేష్, చిన్న వెంకటేశ్వర్లు, మాజీ రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ అన్న రాజమల్లు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అల్లి రవి, గౌడ సంఘం గౌరవ అధ్యక్షుడు మంచిక దేవేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పత్తి కుమారస్వామి, కొమ్మ రవి, యశోద నర్సింగం, సుధాకర్, శ్రీరామోజు మదుకర చారి, పుంజాల సంపత్ పాల్గొన్నారు.

ఎల్ నినో సాకుతో బియ్యం ధరల పెంపు దారుణం

అక్రమ నిల్వదారులపై టాస్క్‌ఫోర్స్ చర్యలు తీసుకోవాలి : ఎంసిపిఐయు



ప్రజాపక్షం / బెల్లంపల్లి టౌన్ ః మార్కెట్లో ఎల్ నినో వాతావరణ పరిస్థితులను సాకుగా చూపుతూ బియ్యం ధరలను అడ్డగోలుగా పెంచడాన్ని ఎంసిపిఐయు మంచిర్యాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వార్థ ప్రయోజనాల కోసం కొంతమంది వ్యాపారులు బియ్యం నిల్వలను దాచి బ్లాక్ మార్కెట్ ద్వారా కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని మండిపడ్డారు. సాధారణ, మధ్యతరగతి, పేద ప్రజలు కొనుగోలు చేసే సన్నబియ్యం ధరలను కిలోకు రూ.60 నుంచి రూ.95 వరకు పెంచి సామాన్యుడి రక్తాన్ని పిండుతున్నారని ఆరోపించారు. ఎల్ నినో వల్ల దిగుబడి తగ్గడాన్ని ఆసరాగా చేసుకొని బ్లాక్ మార్కెట్ వ్యాపారులు దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. అధికారులు తక్షణమే స్పందించి బియ్యం హోల్‌సేల్ కేంద్రాలు, మిల్లులపై టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అక్రమ నిల్వలను వెలికితీసి నియంత్రిత ధరలకే బియ్యం లభించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, నాయకులు సంబోధి రాజేష్, ఆకాష్ పాల్గొన్నారు.

కురం సూరు వర్ధంతి గోడపత్రికల విడుదల



ప్రజాపక్షం/వాంకిడిః కొలాం వీరుడు కురం సూరు 29వ వర్ధంతి కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆదివారం వాంకిడిలో మండల కొలాం సేవా సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం రవిచంద్రనగర్‌లో ఈ నెల 29న నిర్వహించనున్న ఈ వర్ధంతి సభకు కొలాం ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షుడు సిదం పగ్గు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలాం సమాజం హక్కుల కోసం పోరాడిన కురం సూరు వర్ధంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కురం సూరు ఆశయాలను స్మరిస్తూ ఆయన పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రవిచంద్రనగర్‌లో జరిగే కార్యక్రమానికి సమాజ బాంధవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురం పగ్గు, ఆత్రం రాము, మడావి జైరాం, సిదం భీంరావ్, మడావి నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా మల్లేశం ఏకగ్రీవం



ప్రజాపక్షం/గూడూరుః మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా మండల మల్లేశం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని బీరన్న దేవాలయం ప్రాంగణంలో కురుమ సభ్యుల సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.సంఘం ప్రధాన కార్యదర్శిగా పోతరాజు రవికుమార్ ఉపాధ్యక్షులుగా కోరే గౌరయ్య, కాలే కుమారస్వామి, కోశాధికారిగా వ్యవహరించిన మాజీ ఎంఇఒ భిక్షపతితో కలిసి జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ అధికారికంగా ప్రకటించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు చీర అశోక్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీలకు అతీతంగా సమాజ హితం కోసం కుల బాంధవులు సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కురుమ సంఘం మాజీ మండల అధ్యక్షుడు ఉపేందర్, జిల్లా ముఖ్య సలహాదారులు, కురుమ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

బాధితురాలు స్వరూప ఆవేదన

ప్రజాపక్షం/గూడూరుః తన భర్తపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని గూడూరు మండలం మట్టేవాడ పంచాయతీ పరిధిలోని శ్రీహనుమాన్ తండాకు చెందిన బాధితురాలు స్వరూప అధికారులను వేడుకున్నారు. ఘటన జరిగి 50 రోజులు గడుస్తున్నా తమకు తగిన న్యాయం జరగలేదని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేవారు.బాధితురాలి వివరాల ప్రకారం గతంలో తమ కుటుంబానికి మరికొందరికి మధ్య గొడవ జరగడంతో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి అనంతరం ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అదే రోజు రాత్రి సుమారు 8:00 గంటల సమయంలో స్థానిక సర్పంచ్‌తో పాటు మరికొందరు ఆసుపత్రి వద్దకు వచ్చి తన భర్తపై విచక్షణారహితంగా దాడి చేశారని ఆమె ఆరోపించారు. ఈ దాడిలో తన భర్తకు కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు పంపినప్పటికీ 50 రోజులు గడిచినా తమకు పూర్తిస్థాయిలో న్యాయం లభించలేదని స్వరూప పేర్కొన్నారు. న్యాయం కోసం జిల్లా కలెక్టర్ ఎస్పి, ఐటిడిఎ పిఒ తదితర ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించినా సరైన స్పందన రాలేదని వాపోయారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని దాడికి పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని తమ కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేవారు.

కొండపై చంద్రుడి కనువిందు



ప్రజాపక్షం/దేవరుప్పుల: ఆకాశంలో ప్రకాశవంతంగా వెలుగుతున్న చంద్రుడు చూపరులను ఆకట్టుకున్నాడు. వెన్నెల కాంతులతో నిండిన ఆకాశం ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసింది. కొండరాళ్లు, పచ్చని చెట్ల మధ్య ప్రకాశవంతంగా వెలుగుతున్న చంద్రుడు చూపరులను ఆకట్టుకున్నాడు. సాయంత్రం వేళ ఆకాశంలో దర్శనమిచ్చిన చందమామ ప్రకృతి అందాలకు మరింత వన్నె తెచ్చాడు. కొండ అంచున చంద్రుడు వెలుగులు విరజిమ్ముతున్న దృశ్యాన్ని అందరినీ ఆకట్టుకుంది.

షార్ట్ సర్క్యూట్‌తో మెకానిక్ షాప్ దగ్ధం

ప్రజాపక్షం/ తాడ్వాయి: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఇర్ప సూర్య బాబు మెకానిక్ షాపు నాలుగు రోజుల క్రితం దగ్ధం అవ్వగా మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహ స్వామి పరామర్శించి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇస్తూ తక్షణ ఆర్థిక సాయంగా రూ.5000 అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆపద వచ్చినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాయ వెంకన్న, ప్రధాన కార్యదర్శి యానాల సిద్దిరెడ్డి, రంగాపురం మాజీ సర్పంచ్ ఇర్ప సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు సతీష్‌బాబుకు సన్మానం



ప్రజాపక్షం/ములుగుః జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కాట్రగడ్డ సతీష్‌బాబును బిసి సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు వంగ రవి ఆధ్వర్యంలో శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించి అభినందనలు తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు రవి తెలిపారు. సతీష్‌బాబు సీనియారిటీ, నిబద్ధతను గుర్తించి జిల్లా రైస్ మిల్లర్లందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. రైతులు, మిల్లర్ల సమస్యల పరిష్కారానికి ఆయన సంధాకర్తగా వ్యవహరిస్తూ, అవసరమైన సమస్యలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షర్పుద్దీన్, పిఏసిఎస్ డైరెక్టర్ బోయిని రాజు, కాంగ్రెస్ నాయకులు గుండెబోయిన రమేష్, బోడ రఘు, ఇమ్మడి రమేష్, గందె రాజు, సయ్యద్ షకీల్ అహ్మద్, గూడెల్లి ఓదెలు, ఓడ రాజు, గుంటోజు నిరంజన్‌చారి పాల్గొన్నారు.